దీనికి చికిత్స లేదా..!

- ప్రతి సేవకూ చేయి చాపుతూ..
- రోగుల జేబు గుల్లచేస్తున్న సిబ్బంది
- రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితి



రాజమహేంద్రవరంలో జిల్లా ప్రభుత్వాసుపత్రి

కంబాలచెరువు: వైద్య రంగానికి ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తోంది.. పేదలందరికీ వైద్యం దరిచేర్చుతోంది.. సర్కారు ఆసుపత్రులకు అవసరమైన అన్ని నిధులు సమకూర్చుతోంది.. అయితే ప్రభుత్వ ఆశయానికి కొందరి నిర్లక్ష్యంగా కారణంగా ఇబ్బంది వస్తోంది. ఇందుకు రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితే నిదర్శనం. ఇక్కడ పలువురు సిబ్బంది ప్రతి సేవకూ చేయి చాపుతున్నారు. బయట ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకొనే స్తోమత లేని పేదలు ఇక్కడికి వస్తుంటే.. వారి జేబులకూ చిల్లులు పెడుతున్నారు. ముందు రోగుల జబ్బు కాదు ఇక్కడి దందాలకు చికిత్స చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అంటున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిని బోధనాసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడకు నిత్యం సుమారు 800 మందికి పైగా రోగులు వస్తుంటారు. ఇందులో 300 మంది వరకూ ఇన్ పేషెంట్‌గా వైద్య సేవలు పొందుతుంటారు. ఆసుపత్రిలో దాదాపు అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

కట్టు కడితే రూ.50 ఇవ్వాల్సిందే..

ప్రమాదంలో గాయపడిన, మానని పుండ్లు, కాలిన గాయాలతో చికిత్సలు చేయించుకోవడానికి నిత్యం ప్రభుత్వాసుపత్రికి అనేక మంది వస్తుంటారు. పుండ్లు, గాయాలతో వచ్చి వచ్చిన వారు డ్రెస్సింగ్ చేయించుకోవాలంటే ఆ వైద్య సేవలు అందించే వ్యక్తికి రూ.50 నుంచి రూ.100 ఇవ్వాల్సిందే. లేదంటే కట్టు కట్టరు.. గంటల తరబడి సదరు బాధితుడితో కాలయాపన చేయిస్తారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చేది పేదలు కావడంతో తిరిగి ఇంటికి వెళ్లేందుకు కనీసం ఆటో చార్జీలు కూడా ఉండని పరిస్థితి. ఈ విధంగా ఇబ్బంది పడిన ఓ మహిళ 'సాక్షి' వద్ద తన బాధను వ్యక్తం చేసింది. ఇదిలాఉంటే ఇక్కడి మాతాశిశు విభాగంలో అధిక సంఖ్యలో గర్భిణులు, ప్రసూతి మహిళలు సేవలు పొందుతుంటారు. గర్భిణి ఆసుపత్రిలో చేరిందంటే ఆమెకు పురుడు వచ్చినప్పటి నుంచి ఇంటికి వెళ్లే వరకూ (పురుడు, బిడ్డకు స్నానం, వైద్య సేవలు) అక్కడ ఉన్న సిబ్బందికి ఎంతో కొంత ముట్టజెప్పాల్సి వస్తుందని ఆయా కుటుంబ సభ్యులు వాపోతున్నారు. పురుడు పోస్తే రూ.500 ముక్కుపిండి వసూలు చేస్తున్నారని అంటున్నారు.

చీరలండి.. పంజాబీ డ్రస్‌లండి..

ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల నుంచి డబ్బులు గుంజే వారు కొందరైతే.. మరికొందరు ఏకంగా ఒక అడుగు ముందుకేసి ఆసుపత్రిలో వస్త్ర వ్యాపారం చేస్తున్నారు. ఆసుపత్రిలో పనిచేస్తూ రూ.వేల జీతం తీసుకునే ఓ నర్సు పంజాబీ డ్రస్‌లు, చీరలు వంటివి తెచ్చి ఆసుపత్రిలో సిబ్బందికి విక్రయిస్తుంది. ఆసుపత్రి పనివేళల్లో రోగులను పట్టించుకోకుండా చీరలు అమ్మే వ్యాపారంలో మునిగితేలుతోంది. ఆసుపత్రికి వచ్చింది మొదలు తిరిగి డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లే వరకూ ఈ విక్రయాల్లో బిజీగా గడుపుతోంది. దీంతో సక్రమంగా సేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది వైద్యులు, వైద్యాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఈ ఘటనపై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌ను సంప్రదించేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. దీంతో ఆసుపత్రి ఆర్‌ఎమ్‌వో ఆనంద్‌ను సంప్రదించగా ఈ విషయాలు ఒకరిద్దరు వచ్చి చెబుతున్నా బాధితులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వడం లేదన్నారు. దీనివల్ల చర్యలు తీసుకోలేకపోతున్నామని వివరించారు. ఆసుపత్రిలో వస్త్ర వ్యాపారం సాగుతుందన్న విషయం తన దృష్టికి రాలేదన్నారు.

స్వయం ఉపాధికి మెప్మా బజార్లు

ఎంపీ మార్గాని భరత్‌రామ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన రాజమహేంద్రవరంలో త్వరలో మెప్మా బజార్లు ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నట్లు ఎంపీ మార్గాని భరత్‌రామ్ వెల్లడించారు. సోమవారం స్థానిక 47వ డివిజన్ టీవీ రోడ్డులో మహిళల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది అక్కా చెల్లెళ్లు తీసుకున్న రూ.25 వేల కోట్లను మాఫీ చేసే బాధ్యతను సీఎం జగన్ తీసుకుని దఫదఫాలుగా బ్యాంకులకు చెల్లిస్తున్నారన్నారు. ఇప్పటికి రెండు విడతలు చెల్లించగా మూడో విడతగా మరో రూ.6,500 కోట్ల రుణమాఫీ చేశారన్నారు. దీనివల్ల నగరంలో 128 గ్రూపుల సభ్యులు లబ్ధి పొందారన్నారు. మరో అడుగు ముందుకు వేసి నగరంలో పలు ప్రధాన సెంటర్లలో మెప్మా బజార్లను ఏర్పాటు చేసి, మహిళలు తయారు చేసిన తినుబండారాలు, వివిధ రకాల ఉత్పత్తులను విక్రయించాలనేది ఈ మెప్మా బజార్ల లక్ష్యమన్నారు. గత ఎన్నికలలో చేసిన పొరపాటు మరోమారు చేయకుండా నగరంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి అంతా కృషి చేయాలని కోరారు. నగరంలో టీడీపీ ఎమ్మెల్యే ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. ప్రభుత్వపరంగా తామే అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మహిళల ఆశీస్సులు కావాలని ఎంపీ కోరారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నాయకులు మజ్జి అప్పారావు, పోలు విజయలక్ష్మి, చోడిశెట్టి సత్యవాణి, తిరగాటి దుర్గ, గుడాల ప్రసాద్, గుడాల ఆదిలక్ష్మి, ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు ఎరువులు సిద్ధం

కడియం: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరులతో ఏఓ మాట్లాడుతూ జేగురుపాడులో నాలుగు టన్నుల యూరియా, దుళ్లలో పది టన్నులు, మురమండలో తొమ్మిది టన్నుల డీఏపీ ఉన్నాయన్నారు. మాధవరాయుడుపాలెంలో యూరియా 2.25 టన్నులు, కడియపులంకలో డీఏపీ నాలుగు టన్నులు, 20.20.13 ఐదు టన్నులు, పొట్టిలంకలో 20.20.13 ఐదు టన్నులు, డీఏపీ ఐదు టన్నులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రస్తుత సీజన్‌కు అవసరమైన పరిమాణంలో ఎరువులను ఆర్బీకేల్లో ఉంచుతున్నామని వివరించారు.

వేధింపులు ఆపాలి

రాజమహేంద్రవరం సిటీ: అశాస్త్రీయ టార్గెట్‌ల పేరుతో తమపై అధికారుల వేధింపులు ఆపాలంటూ తపాలా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం ఆ శాఖ ఉద్యోగుల రాష్ట్ర ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఈ నిరసన తెలిపారు. సంఘం కార్యదర్శి కొండబాబు మాట్లాడుతూ ఇంతకు ముందు కేవలం మార్చి నెలకు మాత్రమే పరిమితమైన టార్గెట్లు ఉండేవని, ఇప్పుడు సంవత్సరం మొత్తం విధించి దారుణమన్నారు. అధికారులు మొండి వైఖరి విడనాడాలని నినాదాలు చేశారు. అనంతరం పోస్టల్ సూపరింటెండెంట్‌ కోమల్‌కుమార్‌కు మెమొరాండం అందజేశారు.

చందన పరామర్శ

కడియం: వెంకాయమ్మపేటలో వైఎస్సార్ సీపీ నాయకుడు అయితరెడ్డి వెంకటస్వామి తల్లి వెంకాయమ్మ ఇటీవల కన్నుమూశారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సోమవారం పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, నర్సరీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శివాజీ పాల్గొన్నారు.

గంజాయి రవాణాను ఉపేక్షించం


సోదాలు చేస్తున్న ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య

రాజమహేంద్రవరం సిటీ: గంజాయి అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ హెచ్చరించారు. సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక రైల్వే స్టేషన్‌లో విస్తృత సోదాలు నిర్వహించారు. పార్శిల్ కార్యాలయంలో అనుమానించిన అన్ని వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్‌ఐలు మావుళ్లు, లోవరాజు, రవిబాబు, శ్రీలక్ష్మి, సీఐబీ ఏఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపుష్పయాగం

కడియం: కడియం భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయం, దుళ్లలోని బాలా త్రిపురసుందరీ సమేత అగస్త్యేశ్వరాలయాల్లో సోమవారం రాత్రి శ్రీపుష్పయాగం వైభవంగా జరిగింది. శివరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో దేవతామూర్తులను వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కడియంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం త్రిశూల స్నానంలో భక్తులు పాల్గొన్నారు. భ్రమరాంబికా మల్లేశ్వరస్వామివారి ఆలయానికి బీజేపీ నాయకుడు ఆకుల శ్రీధర్ రూ.30 వేల విలువైన ఊయలను అందజేశారు. దీనిని ధర్మకర్తల మండలి చైర్మన్ ఆర్‌ఎస్‌ఎన్ మూర్తికి ఇచ్చారు.

'పోలవరం' పరిశీలనకు సీపీఐ నేతలు

ప్రకాశంనగర్: పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో నేతలు తరలి వెళ్లారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ నుంచి పోలవరం ప్రాజెక్టుకు బయలుదేరారు. తొలుత ఎర్ర జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, రాష్ట్ర నాయకులు జేవీ సత్యనారాయణ మూర్తి, అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి తూర్పుగోదావరి జిల్లా యూనిట్ చైర్మన్, జనరల్ సెక్రటరీలు ఎం.క్రాంతిప్రసాదరావు, ఏఆర్ శివకుమార్ కోరారు. స్థానిక రెవెన్యూ అతిథి భవనంలో సోమవారం వారి అధ్యక్షతన సమావేశం జరిగింది. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. అసోసియేట్ చైర్మన్ ఎంజీ అహ్మద్, కోశాధికారి స్వామినాథన్ పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్య

కంబాలచెరువు: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. టి.నగర్‌కు చెందిన టి.కృష్ణ (55) బజ్జీల వ్యాపారం చేసేవారు. అతను మద్యం అతిగా తాగుతుండడంతో భార్య ఇటీవల గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఆదివారం ఫుల్‌గా మద్యం తాగి కృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే మంగళవారపు పేటలో వడ్రంగి పనిచేసే వి.శ్రీనివాస్ (55) అతిగా మద్యం తాగి మూడు రోజుల కిందట ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అతని కుమార్తె సోమవారం వచ్చి తలుపులు తెరిచే సరికి శ్రీనివాస్ మృతదేహం పాడైపోయి దుర్గంధం వెదజల్లింది. ఈ విషయమై ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎంపీడీఓ దంపతులకు ఎంపీ పరామర్శ


ఎంపీ భరత్‌రామ్ వద్ద విలపిస్తున్న ఎంపీడీఓ రత్నకుమారి దంపతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తన మిత్రుడు సందీప్ (30) మృతికి వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం రూరల్ ఎంపీడీవో కె.రత్నకుమారిని పరామర్శించేందుకు ధవళేశ్వరం వెళ్లారు. ఇంట్లోకి వెళ్లగానే ఎంపీడీఓ దంపతులు ఎంపీని పట్టుకుని బోరున విలపించారు. సందీప్ తనకు అత్యంత ఆప్తుడని, అసలు ఇంత దారుణం ఎలా జరిగిందని ఆయన అడిగారు. గుండెలో మంటగా ఉందని చెబితే గ్యాస్ట్రిక్ సమస్య అయి ఉండవచ్చని హాస్పిటల్‌కు తీసుకువెళ్లామని, రాజు న్యూరో సర్జన్ హాస్పిటల్ వైద్యులు పొరపాటు వల్లే తమ కుమారుడు మృతి చెందాడని ఎంపీకి వారు వివరించారు. వెంటనే సంబంధిత ఆసుపత్రికి ఎంపీ భరత్‌రామ్ ఫోన్ చేశారు. సందీప్ మృతికి కారణమేంటని, మీరేం వైద్యం చేశారో సమగ్ర నివేదిక పంపాలని వైద్యులను అడిగారు. అనంతరం సందీప్ చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: 1902కు వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు డిప్యూటీ కమిషనర్ పీఎం సత్యవేణి, ముఖ్య పట్టణ ప్లానింగ్ అధికారి జె.సూరజ్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండు రంగారావు, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ సమస్య నేరుగా సీఎంకు చెప్పుకునే అవకాశం సాధ్యం కానందున 1902 టోల్ ఫ్రీ ద్వారా ప్రజలు ఫిర్యాదులు వివరించవచ్చన్నారు. స్పందనలో 15 అర్జీలు స్వీకరించామని వివరించారు.

సమస్యలు తీర్చేందుకు కృషి


రాజీవ్‌నగర్‌లో డ్రైన్‌ను పరిశీలిస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: ధవళేశ్వరం రాజీవ్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సోమవారం పర్యటించారు. అక్కడ వాంబే గృహాల వద్ద ఉన్న డ్రైన్లను పరిశీలించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని నాగేశ్వర్ హామీ ఇచ్చారు. స్పందనలో రాజీవ్‌నగర్, వాంబే గృహాల డ్రైన్లు, పారిశుధ్య విషయంపై అర్జీ దాఖలైన విషయం తెలుసుకున్న ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం రాజీవ్‌నగర్, ఎన్‌కే కాలనీలో వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. స్థానికులు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరగా త్వరలోనే నిర్మించే విధంగా ప్రణాళిక రూపొందిస్తానని చందన అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోలి దేవకుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, శివాజీ, పట్టపగలు వెంకటలక్ష్మి, దుర్గ, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యా బోధనపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో వివిధ కళాశాలలకు చెందిన ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థినులకు సోమవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి ఆధ్వర్యంలో అధ్యాపకులు పలు అంశాలు తెలిపారు. ఈ కళాశాలలో విద్యాబోధన, నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించారు. డిగ్రీ స్థాయిలో ఏపీ పాఠ్యాంశాలు బోధిస్తారో తెలిపి కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఈ–క్లాస్ రూమ్, వర్చువల్ క్లాస్ రూమ్ తదితర విషయాలపై వివరించారు. ప్రైవేట్ కళాశాల కంటే అతి తక్కువ ఫీజులతో డిగ్రీ పూర్తి చేసుకునే అవకాశాన్ని చదువుతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునే అవకాశాలను విద్యార్థినులకు తెలిపారు. అడ్మిషన్ కమిటీ మెంబర్స్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.విజయభారతలక్ష్మి, అకడమిక్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనూరాధ సూర్యకుమారి, ఎం.సునీత పాల్గొన్నారు.

నైతికతపై సదస్సు

ప్రకాశంనగర్: స్థానిక నెహ్రూ నగర్‌లోని బిలాల్ షాదీఖానాలో 'సమాజంలో నైతికత స్థాపన ఎలా' అనే అంశంపై సభ జరిగింది. జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రాఫీక్, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు కె.మోజెస్‌బాబు, బీజేపీ రూరల్ మాజీ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు మాట్లాడారు. జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర సందేశ కార్యదర్శి హిమాయత్, జిల్లా అధ్యక్షుడు అన్సార్ అహ్మద్, నగర అధ్యక్షుడు జమీర్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనేక రుగ్మతలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వ లక్ష్యం మేరకు 'డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' సాకారానికి విద్యార్థులు కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకుంటే అనేక రుగ్మతలు వస్తాయన్నారు. ఎస్ఈబీ ఎస్సై మహేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: గంజాయితో నలుగురిని అరెస్ట్ చేసినట్లు బొమ్మూరు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం స్పిన్నింగ్ మిల్లు కాలనీకి చెందిన గెద్దాడ మనోజ్, హుకుంపేటకు చెందిన తోట వినయ్, అయ్యప్పనగర్‌కు చెందిన కోట తులసీరామ్, ఐదు బళ్ల మార్కెట్ సెంటర్‌కు చెందిన దొంగా సాదీరాజులు విశాఖ ప్రాంతం నర్సీపట్నంలో గంజాయిని కిలో రూ.వెయ్యి చొప్పున 22 కిలోలు కొనుగోలు చేశారు. దానిని శాటిలైట్ సిటీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద విక్రయించేందుకు సిద్ధమవుతుండగా బొమ్మూరు ఎస్సై శివాజీ, సిబ్బందితో దాడి చేశారు. ఆ నలుగురిని అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయకుమార్ కేసు నమోదు చేశారు.

హృదయాన్ని హత్తుకునేలా..

- ఆలోచింపజేసిన కెండోనియా నాటకం
- కొనసాగిన రెండో రోజు ప్రదర్శన


కెండోనియా నాటకంలో ఓ సన్నివేశం


ఓ సన్నివేశంలో నటీనటులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నాటకం మనసును హత్తుకుంది.. సోమవారం కర్ణాటకకు చెందిన అస్థిత్వ థియేటర్ గ్రూప్ ప్రదర్శించిన కెండోనియా నాటకం శ్రోతలను ఆలోచింపజేసింది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) ఆధ్వర్యంలో 22వ భారత్ రంగ్ మహోత్సవంలో భాగంగా రాజమహేంద్రవరం శ్రీఆనం కళాకేంద్రంలో రెండో రోజు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. కన్నడలో ప్రదర్శించిన ఈ నాటకాన్ని భాష అర్థం కాకపోయినా నటీనటుల హావభావాలతో ప్రేక్షకులను రంజింపజేశారు. నాటకంలోని ప్రధాన పాత్రధారి దమన్న తన గ్రామంలో తన కుటుంబంతో ఆనందంగా ఉంటాడు. సాధారణ టీ స్టాల్ యజమానిగా ఆనందంగా జీవిస్తుంటాడు. అత్యాశకు పోయి ఒక వీసా ఏజెంట్ మాటలు విని అనేక కష్టాల్లో పడతాడు. కెండోనియా అనే దేశం ఉందని, అక్కడికి వెళితే జీవితం స్వర్గంగా మారుతుందని ఏజెంట్ ఆశ పెడతాడు. ఉన్న ఆస్తిని అమ్మేసి కెండోనియా దేశానికి వెళతాడు. ఒక్కసారి అక్కడికి చేరుకున్న తరువాత తిరిగి వెనక్కి రావడం జరగదని ఆలస్యంగా తెలుసుకుంటాడు. చేసేదేమీ లేక సర్కస్ కంపెనీలో కోతిలా వేషం వేసుకుని పనిచేస్తుంటాడు. అక్కడ జరిగిన సంఘటనలు, అతని కలుసుకునే వ్యక్తుల తాలూకా విషయాలను డైరెక్టర్ అరుణ్‌లాల్ చక్కగా ఆవిష్కరించారు.

ప్రతిచోటా ఆదరణ



నేను 24 ఏళ్ల నుంచి నాటకాలను ప్రదర్శిస్తున్నా. నేటి ఆధునిక సమాజంలో నాటకాలు విజన్‌తో కూడి కున్నవి ప్రదర్శించాలి. అప్పుడే ప్రేక్షకులు చూడటానికి వస్తారు. 2015లో కన్నడంలో బెస్ట్ డైరెక్టర్ అవార్డు వచ్చింది. ఈ నాటకాన్ని అనేక సార్లు ప్రదర్శించాం. ప్రతిచోటా మంచి ఆదరణ లభించింది.

– అరుణ్‌లాల్, డైరెక్టర్

మంచి వేదిక దొరికింది



నాటక కళాకారులకు నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ద్వారా మంచి వేదిక దొరుకుతుంది. లైటింగ్, సౌండ్ విభాగాలలో కొత్త విషయాలను చేర్చడం వల్ల మా నాటకానికి ఆదరణ లభిస్తుంది. 15 ఏళ్లుగా థియేటర్ ఆర్టిస్టుగా ఉన్నాను. పలు పురస్కారాలు అందుకున్నాను.

– క్రిస్టోఫర్, నటుడు, టెక్నికల్ విభాగం ఇన్‌చార్జి